క్లుప్తంగా

ఘనంగా నాంచారమ్మ ఆలయ వార్షికోత్సవం



కలశాలతో గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళలు

ఉండి: స్థానిక దేవుడిగుడి ప్రాంతంలో కొలువైన నాంచారమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఆడపడుచులు, మహిళా భక్తులతో పెద్ద ఎత్తున కలశాలతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ గ్రామోత్సవం ప్రధాన రహదారుల ద్వారా ఉండి సెంటర్ మీదుగా ఆలయానికి చేరుకుకుంది. అమ్మవారి దర్శనానంతరం భక్తులు మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి



పాతపాటి శ్రీనివాసరాజు

కాళ్ల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) సభ్యుడిగా నియమించడంపై పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి క్షత్రియ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రానున్న కాలంలో పార్టీ బలోపేతం కోసం మరింత కృషి చేస్తానని, పార్టీ అధినేత తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. ఆయన నియామకంపై పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయ గోపుర బ్రహ్మకపాలం మూసివేత



ఆలయ గోపురం బ్రహ్మకపాలం మూసివేతకు పూజలు చేస్తున్న భక్తులు

యలమంచిలి: గ్రామంలో పునర్నిర్మిస్తున్న మూలస్థానేశ్వరి దేవి ఆలయ గోపురం పనులు పూర్తి కావడంతో శనివారం బ్రహ్మకపాలం మూసివేతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళ్లకూరి దుర్గా ప్రసాద్ శర్మ బ్రహ్మత్వంలో తాళ్లూరి శ్రీనివాస్ (వైజాగ్ బుజ్జి), శిరీష దంపతులు పీటలపై కూర్చుని పూజలు, హోమం చేశారు. హోమం పూర్తయిన తరువాత గోపురం మీద బూరెలు వేసి అనంతరం బ్రహ్మకపాలం మూశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఫిబ్రవరి 20న అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేసి ఆలయాన్ని పునః ప్రారంభిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు గురుబ్రహ్మ పురస్కారం

పెనుగొండ: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గోదావరి టాలెంట్ టెస్ట్ విద్యారంగ పత్రిక పెనుగొండకు చెందిన ఉపాధ్యాయులు ఎస్.వెంకట అప్పారావు, సీతారత్నంలకు గురుబ్రహ్మ పురస్కారాన్ని అందించింది. శనివారం పెనుగొండలో విలేకరులకు ఉపాధ్యాయుడు ఎస్.వెంకట అప్పారావు వివరాలు అందించారు. పోటీ పరీక్షల్లో విద్యార్థులను తీర్చిదిద్దడంలోనూ, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచే విధంగా విద్యార్థులను ప్రోత్సహించినందుకు గానూ అవార్డుకు ఎంపిక చేశారన్నారు. ఆదివారం రాజమండ్రిలో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డును అందిస్తారని పేర్కొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత



విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఫీజు రీయింబర్స్‌మెంట్ నిమిత్తం వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం జాతీయ స్థాయిలో విద్యా సంస్థల్లో ప్రవేశం పొందుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటును అందించాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కోసూరి రామకృష్ణ ఆనందరాజు అన్నారు. శనివారం ఎంబీబీఎస్ విద్యార్థి కడియాల నాగ మల్లేశ్వరరావుకు రూ.34 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా డా ఆనందరాజు మాట్లాడుతూ మన రాష్ట్రం నుంచి నీట్, ఐఐటి, ఎన్ఐటీల ద్వారా ప్రవేశాలు పొందుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటును అందించాలన్నారు. కార్యక్రమంలో షేక్ పీర్ సాహెబ్, డాక్టర్ ముచ్చర్ల సంజయ్, చందక రాము, జవ్వాజి కళ్యాణ్, గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నిమజ్జనోత్సవాల సందడి



భీమవరం(ప్రకాశంచౌక్): మెంటేవారితోటలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



భీమవరం(ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ ఆలయం వద్ద అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



కాళ్ల: దొడ్డనపూడిలో అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

- దసరా వేడుకలు ముగియడంతో గంగమ్మ ఒడికి చేరుతున్న దుర్గమ్మ
- ఆకట్టుకుంటున్న గ్రామోత్సవాలు

భీమవరం(ప్రకాశంచౌక్): గ్రామాల్లో దసరా ఉత్సవాలు ముగియడంతో నిమజ్జనోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం మెంటేవారి తోటలోని శ్రీబాలత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలు, స్థానిక మహిళా భక్తుల కోలాట ప్రదర్శనలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ అర్చకుడు కొమ్ము శ్రీనివాస్, కమిటీ సభ్యులు, దాతలు, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మావుళ్లమ్మ సన్నిధిలో అన్న సమారాధన

పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్ళమ్మ వారి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా శనివారం పెద్ద ఎత్తున అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నసంతర్పణ ప్రారంభించారు. సుమారు 15000 మంది భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దొడ్డనపూడిలో..

కాళ్ల: దసరా శరన్నవరాత్రి వేడుకలు మండలంలో పండుగ వాతావరణంలో ముగిశాయి. పలు గ్రామాల్లో శనివారం అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ప్రధానంగా దొడ్డనపూడి గ్రామంలో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహాన్ని తీన్మార్ వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు బాణసంచా కాల్పుల నడుమ గ్రామోత్సవం నిర్వహించి పంట కాలువల్లో నిమజ్జనం చేశారు. అలాగే పలు గ్రామాల్లో అమ్మవారి మండపాల వద్ద అన్న సమారాధనలు నిర్వహించారు.

పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు

భీమవరం: జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా ఈ నెల 8 నుంచి జిల్లాలోని తణుకు, వీరవాసరంలో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు భీమవరం పోస్టాఫీసు సీనియర్ సూపరింటెండెంట్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 8, 9వ తేదీల్లో తణుకు ప్రభుత్వ బాలుర పాఠశాలలో, 10,11 తేదీల్లో తణుకు బాలికోన్నత పాఠశాల, 13, 14 తేదీల్లో వీరవాసరం ఎంఆర్‌కే జెడ్పీ హైస్కూల్లో క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏడీఏ కార్యాలయం తరలింపు



ఆటోలో సామగ్రి తరలిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) కార్యాలయాన్ని ఉండి మార్కెట్ యార్డులోకి తరలించారు. ఈ మేరకు శనివారం స్థానికంగా ఉన్న కార్యాలయాన్ని ఖాళీ చేశారు. ఆకివీడు వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంగా ఏర్పడిన తరువాత ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాల్లోని వ్యవసాయదారులకు పలు సేవలందించారు. ఏడీఏ కార్యాలయంతో పాటు మండల వ్యవసాయ కార్యాలయం ఒకే చోట ఉండటంతో రైతులకు మేలు జరిగింది. ఉండి మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన అగ్రిల్యాబ్ ప్రాంగణంలోకి ఏడీఏ కార్యాలయాన్ని తరలించారు.

రేపటి నుంచి చేనేత కార్మిక సంఘ మహాసభలు



కరపత్రాలు పంచుతున్న దృశ్యం

నరసాపురం: సత్తినపల్లిలో ఈనెల 6,7 తేదీల్లో జరిగే ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి బూడిదజోగేశ్వరరావు కోరారు. శనివారం పట్టణంలోని మంగెనవారినగర్‌లో సంఘం ఆధ్వర్యంలో మహాసభల కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా జోగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న చేనేత వ్యతిరేక విధానాలతో రాష్ట్రంలో చేనేత కార్మికుల స్థితిగతులు మరింత దుర్భరంగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వాసా రామలింగం, సిద్దాని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



ఆకివీడు: మాట్లాడుతున్న ఎంపీపీ కరారి జయలక్ష్మి



కాళ్ల: సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారి ఇందిరాప్రియదర్శిని



ఉండి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యనారాయణ

ఆకివీడు: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, పంచాయతీలు చర్యలు చేట్టాలని ఎంపీపీ కరారి జయలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ హాలులో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షతవహించిన జయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరాను మెరుగుపరచాలని సూచించారు. సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని, ఎవరైనా గైర్హాజరైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో సమస్యల్ని ఎంపీటీసీ సభ్యుల ద్వారా తెలుసుకుని మండల అధికారులు పరిష్కారానికి కృషి చేయాలని జయలక్ష్మి పిలుపునిచ్చారు. ఎంపీడీఓ బాబూరావు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ పథకం ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓ ఎ.రవీంద్ర మాట్లాడుతూ మండలంలో మూడు గ్రామాల్లో పాఠశాలల్ని ఎత్తివేశామని చెప్పారు. డ్రెయినేజీ ఏఈ జయప్రకాష్ మాట్లాడుతూ డ్రెయినేజీలలో పూడికతీత పనులు చేపట్టామన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ, వైస్ ఎంపీపీలు సైదాల సూర్యనారాయణ, కిల్లి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు పి.సూర్యనారాయణరాజు, పుణ్యవతి, బొడ్డుపల్లి రోహిణి, కో-ఆప్షన్‌సభ్యులు పి.షుక్, సర్పంచ్‌లు ఎస్.రామరాజు, నందమూరి ప్రకాశం, నాగేశ్వరరావు, చిగురుపాటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కాళ్ల: ఆక్వా రైతులు తమ చెరువుల నమోదు ప్రక్రియను ఆన్‌లైన్లో త్వరితగతిన చేసుకోవాలని మత్స్యశాఖ అధికారి ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు అధ్యక్షతన నిర్వహి/ంచారు. ఈ సమావేశంలో ఆయా శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి పనుల గురించి చర్చించారు. అదేవిధంగా మండలంలో ఆయా గ్రామాల్లో చేపట్టనున్న పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాపతినిధులు మాట్లాడుతూ గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని వాటిని నియంత్రించాలని కోరారు. అనంతరం ఉత్తమ ఎంపీపీగా అవార్డు పొందిన శిరీష విశ్వనాథరాజును సమావేశంలో ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరుపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఏఈలు రమేష్, రాంబాబు, లీలాప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

ఉండి: కేంద్రప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలపై వారికి అధికారులు అవగాహన కల్పించాలని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ తమ శాఖల నివేదికలను సభకు చదివి వినిపించారు.అనంతరం ఎంపీ మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా వారికి వివరాలు తెలియాలన్నారు. మండలంలోని రూ.30 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మించేందుకు టెండర్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సీవీఎస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

9 నుంచి తపాలా శాఖ వారోత్సవాలు



తపాలాశాఖ వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: శ్రీ విజ్ఞాన వేదిక, భీమవరం పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి వారంరోజుల పాటు భారతీయ తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. శనివారం భీమవరం హెడ్‌పోస్ట్ ఆఫీస్‌లో తపాలా వారోత్సవాల పోస్టర్‌ను హెడ్ పోస్ట్ మాస్టర్ పొలమూరి రాజు ఆవిష్కరించారు. అనంతరం రాజు మాట్లాడుతూ దేశంలో తపాలాశాఖ ఎంతో కీలకమైనదని పోస్టల్ శాఖలో ఉన్న అనేక పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తపాలా శాఖ కార్యకలాపాలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఏపీఓ సీహెచ్ లెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించాలి



ఎగ్జిబిషన్‌లో వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశంచౌక్): చేనేత, టెక్స్‌టైల్స్, రెడీమేడ్ ఉత్పత్తులపై జీఎస్టి తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు సూచించారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం అమల్లో భాగంగా జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో చేనేత, టెక్స్‌టైల్స్, రెడీమేడ్ ఉత్పత్తులపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్లో ప్రదర్శించిన చేనేత వస్త్రాలు, భీమవరానికి చెందిన సీఎంఆర్, రేమాండ్స్, ఇభా స్టోర్స్ వారు ఏర్పాటు చేసిన రెడీమేడ్ దుస్తులు, నరసాపురం లేస్ పార్క్‌కి చెందిన లేస్ ఉత్పత్తులను పరిశీలించి జీఎస్టీ తగ్గింపునకు ముందు ప్రస్తుత ధర సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రతి కుటుంబానికి ఆర్థికంగా కొంత ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ కేపీ శైలజ, జిల్లా హ్యాండ్లూమ్స్ అధికారి కె.అప్పారావు, జిల్లా పరిశ్రమల అధికారి యు.మంగపతి రావు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వి.కేదారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులందరికీ వాహన మిత్ర అమలు చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న వాసుదేవరావు

భీమవరం: లైసెన్స్ ఉన్న ఆటో కార్మికులందరికీ వాహనమిత్ర ద్వారా రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. శనివారం భీమవరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం అమలు చేసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆటోవర్కర్ భార్య స్కీము వర్కర్‌గా ఉందని, కుటుంబంలో మరొకరికి ఉపాధి ఉందనే పేరుతో కొంతమంది ఆటోవర్కర్స్‌కు వాహనమిత్ర పథకం అమలు కాకపోవడం ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులందరినీ గుర్తించి వాహన మిత్ర పథకాన్ని అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.ఆంజనేయులు, డి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల సంఘ భవనానికి కృషి



కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలో మావుళ్ళమ్మ గుడి వద్ద ఉన్న గ్రామ కచేరి చావిడి స్థలములో నిర్మిస్తున్న పశ్చిమగోదావరి జిల్లా గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం భవన నిర్మాణానికి సహాయం అందించాలని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కోరారు. ఈ మేరకు శనివారం శ్రీనివాసవర్మ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. అనంతరం శ్రీనివాసవర్మను సత్కరించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జి. జకరయ్య, భీమవరం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కెనడి, సురేష్, జిల్లా నాయకులు అప్పాజీ, యాకబ్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు

కాళ్ల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శివకుమార్, మండల మాజీ కన్వీనర్ రుద్రరాజు వెంకట రామ కృష్ణంరాజు, ఉపసర్పంచ్ కటారి లక్ష్మీపతిరాజు తెలిపారు. జువ్వలపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రుద్దరాజు రామకృష్ణంరాజు ఇంటి వద్ద శనివారం సాయంత్రం గ్రామ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పరిపాలన పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదుండి సురేష్, ఎంపీటీసీ సభ్యుడు మీసాల శ్రీనివాస్, సురేష్, గుర్రం బెనహర్, బోధనపు కన్నయ్య, గాతల జాన్‌వెస్లి ,అంగర ఏసుబాబు, శ్రీనివాస్, గాతల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా డ్రెయిన్ లేక అవస్థలు

నరసాపురం: పట్టణంలోని పాత రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో ఉన్న డ్రెయిన్ శిథిలమైంది. దీంతో మురుగుపారక పోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ డ్రెయిన్‌ను పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అయితే మునిసిపల్ అధికారులు ఈ అంశంపై దృష్టిపెట్టడం లేదని వాపోతున్నారు. స్థానిక రాజరాజేశ్వరి థియేటర్ వద్ద నుంచి ఈ డ్రెయిన్‌ను ఆనుకుని పెద్ద సంఖ్యలో ఇళ్లు ఉన్నాయి. ఈ డ్రెయిన్ రూరల్ పోలీస్ స్టేషన్ అవతల కొద్దిదూరంలో మెయిన్ డ్రెయిన్‌లో కలుస్తుంది. ప్రస్తుతం డ్రెయిన్ శిథిలం కావడంతో మురుగు సవ్యంగా పారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కా డ్రెయిన్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

బతకలేకపోతున్నామంటూ ఆటో డ్రైవర్ ఆవేదన



సభలో మాట్లాడుతున్న ఆటో కార్మికుడు

ఆకివీడు: ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని, ఈ పథకాన్ని రద్దు చేయాలని ఆటో కార్మికుడు ఆవేదన వ్యక్తం చేశాడు. స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో శనివారం ×ఆటో డ్రైవర్ల సేవలో¤ కార్యక్రమం రోడ్డు ట్రాన్స్‌పోర్టు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మాట్లాడిన తర్వాత ఆటో డ్రైవర్లు మాట్లాడాలని సూచించడంతో కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పి.దుర్గారావు మాట్లాడుతూ మహిళల ఉచిత బస్సు పథకం వల్ల తమ బతుకులు రోడ్డున పడ్డాయంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. అద్దెలు, కరెంటు బిల్లులు కట్టలేక, పిల్లలను కూడా చదివించలేక పోతున్నామని వాపోయాడు. ఉచిత బస్సు పథకం ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. ఆటోడ్రైవర్‌కు రూ. 15 వేలు ఇస్తున్నారని, ఇది రోజుకు రూ. 60 అవుతుందని, ఇది మనకు అవసరమా? అంటూ ప్రశ్నించడంతో అక్కడున్న వారంతా కంగుతిన్నారు. ఉచిత బస్సు పథకం అమలు నిలిపేస్తేనే ఆటో డ్రైవర్లు బతుకుతారంటూ దుర్గారావు పేర్కొన్నాడు.

బస్సు ఢీకొని గ్రామ కార్యదర్శికి గాయాలు

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి కొప్పుల వెంకట రామారావును శుక్రవారం రాత్రి ఆర్టీసీ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆయన తల నడుమ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను పాలకొల్లులో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం చేసి, అనంతరం ఉన్నత వైద్యం నిమిత్తం రాజమండ్రి తరలించారు.

దివ్యాంగ చిన్నారులను ఆదరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగ చిన్నారులకు భవిత సెంటర్ ఆధ్వర్యంలో ఇంటి వద్దే ప్రత్యేక విద్యను అందిస్తున్నట్లు భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కే బాల ఈశ్వరయ్య అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలోని అతి తీవ్ర వైకల్యం ఉన్న భవిత పిల్లలకు శనివారం ఇంటి వద్దకు వెళ్లి ప్రత్యేక శిక్షణ, ఫిజియోథెరపీలు నిర్వహించారు. బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలకు అందించే ఉపకరణాలు, బోధన సామగ్రి తదితర విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సమాజంలో నార్మల్ పిల్లలతో సమానంగా దివ్యాంగ చిన్నారులను గౌరవించాలని, వారి విద్య అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.